# పెళ్ళి చూపులు

ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న నిర్భాగ్యుడిలా జిడ్డుమొహంతో కన్పించే రామ్మోహన్లో రెండుమూడు రోజుల నుండి బోలెడంత మార్పు కనిపిస్తోంది. పాతరక్తాన్నంతా తోడేసి కొత్త రక్తమెక్కించిన వాడిలా హుషారుగా పలుకరిస్తున్నాడందర్నీ. లక్షల ఆస్తి ఒకేరోజు సంపాదించిన వాడిలో వచ్చిన హుందాతనం రామ్మోహన్లో కన్పించే సరికి ఆఫీసు స్టాఫంతా డంగైపోతున్నారు.

రామ్మోహన్నుండి అప్పు సంపాదించాలని ఆరుసార్లు ప్రయత్నించి అపజయం పాలైన ఇన్వార్డు క్లార్కు అప్పల ఆనందరావు పాతిక రూపాయల అప్పు సంపాదించి—పదిసార్లు చిత్తుగా ఓడిపోయి పదకొండోసారి పెద్ద మెజారిటీతో గెల్చిన ఎమ్మెల్యేలా ఫీలౌతున్నారు.

దీంతో రామ్మోహన్ ఖుషీలో కల్తీలేదని, సాధించదల్చుకున్నదేదో సాధించి వుంటాడని నిర్ణయించుకున్నారు. అయినా అందర్నీ పట్టుకు పీడుస్తుందొకే సందేహం. "గోదావరి బేసిన్లో

ఉబికి వచ్చిన గ్యాసులా రామ్మోహన్లో ఉత్సాహం పెల్లుబుకటాని కి కారణమేమిటో?"

తన సెక్షన్లో పంజేసే యల్డీసీలు రాసిన ఫైళ్ళను నాల్గుసార్ల యినా తిరగిరాయించే రామ్మోహన్ ఒకేసారి రాసిన ఫైలుమీద సంతకంచేసి నేరుగా ఆఫీసరు చాంబర్లోకి పంపించేసాడు.

ఎర్రగా బుర్రగా కాకున్నా, మధ్యరకం కాకున్నా సగటు మనిషన్పించుకున్నవాడు. విశ్వవిద్యాలయం పట్టా చేతితో పడగానే ఎగిరి గంతేసాడు. పట్టమని పదిరోజులన్నా గడవకముందే యల్డీసీగా చేరాడు. ఐదు సంవత్సరాల అనుభవముతోనే డిపార్టుమెంటు పరీక్షపాసై ప్రగతి భవనం తొలిమెట్టెక్కి తోటివారితో సెభాసనిపించుకున్నాడు.

యల్డీసీగా ఉన్నప్పుడు పాతిక పెళ్ళి చూపులకెళ్ళొచ్చాడు. యూ.డి.సి. ఐంతర్వాత మరో పాతిక పూర్తిచేసి హాఫ్ సెంచరీ కొట్టానని ఆమితానంద పడిపోయాడు.

పెళ్ళిచూపుల కెళ్ళడమొక సరదా ఐపోయింది వెళ్ళగానే స్వీటు, హాటు, కాఫీ లాగించేసి అమ్మాయిని చూడ్డం అలవాటైంది. అమ్మాయి అందంగావుంటే కట్నం తేలేదు. కట్నం తెచ్చేదైతే అందంగా ఉండదు. రెండువుంటే అమ్మాయికి చదువురాదు. మూడూ వున్న అమ్మాయిలొకరిద్దరు తగిలారు కాని వారుద్యోగం చేయడంలేదని నచ్చలేదు.

నాల్రోజులక్రితమే సిద్దిపేట వెళ్ళొచ్చాడు యాభయ్యొకటవ పెళ్ళిచూపులకు. అమ్మాయి పేరు సుగుణ. సార్థక నామధేయురాలాన్పించింది. అందం, చదువు, ఉద్యోగాలున్నావి. కట్నం

గూడా ఇవ్వగలరు. యస్కేసి (స్వీటు, కారా, కాఫీ) పూర్తిచేసి, అమ్మాయినిచూచి-వచ్చేముందు.

"అమ్మాయి గురించి నీ అభిప్రాయ మేమిటి బాబూ?" అనడిగారు అమ్మాయి తండ్రి ఆదినారాయణగారు కళ్ళజోడు సవరించుకుంటూ.

రామ్మోహన్‌కు అమ్మాయి బాగానచ్చింది. కాని అలవాటు ప్రకారం.

"ఇంటికెళ్ళి ఉత్తరం రాస్తానండీ!" అనేసి వచ్చాడు. రాగానే ఎగిరి మంచమ్మీద పిల్లిమొగ్గలేసి 'అమ్మాయి నచ్చింది. వెంటనే ముహూర్తాలు పెట్టించి ఉత్తరం రాయండ'ని ఉత్తరం ముక్కరాసి పడేసాడు.

అప్పట్నుంచీ సుగుణే కళ్ళల్లో మెదులుతూంది తన ఊహల ఉయ్యాల్లో ఆడుకుంటుంది. పగలంతా కళ్ళల్లో కాపురముండి రాత్రికి కలలో కొచ్చి ఒళ్ళంతా చక్కిలి దింతలు పెడుతుంది. జుట్టులోకి చెయ్యిపోనిచ్చి కమ్మగా కబుర్లు చెబుతుంది.

అదీ కారణం.

అందుకే మరో లోకంలో విహరిస్తూ షడస్‌గా మంచివాడన్పించుకున్నాడు. ముహూర్తాల గురించి సిద్ధిపేటనుండి ఉత్తరమెప్పుడొస్తుందాని ఒళ్ళంతా కళ్ళుజేసుకుని ఎదురు చూస్తున్నాడు.

నిన్న తనపేర ఉత్తరం వచ్చిందనగానే ఆదే వుత్తరమనుకుని ఆత్రతగా విప్పి చూశాడు....కాని అది తన తండ్రిరాసాడు.

"ని...ఇన్నాళ్ళకైనా ఒకమ్మాయిని ఇష్టపడి ఒకింటి వాడవౌతున్నందుకు మీ అమ్మా ఆనందపడి పోయింది.

కథా నిలయం
878
శ్రీకాకుళం

బెండాకాయలా ముదిరిపోతున్న బ్రహ్మచారి కొడుక్కు పెళ్ళిచేయ లేని అసమర్థుడని నన్నాడిపోసుకుంటున్న వాళ్ళకు కుక్క కాటుకు చెప్పుదెబ్బలా సమాధానం చెప్పే అవకాశం కల్పించావు...." దాంట్లోని ముఖ్యాంశాలు.

టేబుల్ మీదున్న ఫైళ్ళను చూస్తూ కూచున్నాడు రామ్మోహన్... నిజానికేమీ తోచడం లేదు.

"ఇదిగో మీ ఉత్తరంసార్!" అప్పుల ఆనందరావు టేబుల్ దగ్గరికొచ్చి స్వయంగా ఉత్తరాన్నందించాడు. కృతజ్ఞతా భారంతో కుంగిపోయాడు రామ్మోహన్. కళ్ళతోనే థాంక్స్ చెప్పేసాడు... ఫ్రమ్ అడ్రసు సిద్దిపేటది. ఒళ్ళంతా గిలిగింతల మయమైంది. ఆపుకుందామన్నా ఆగని ముసిముసి నవ్వుల్తో ఉత్తరం విప్పాడు.

"శ్రీరామ్మోహన్ గార్కి-నమస్కారాలు"

మాఅమ్మాయి నచ్చిందని నీవురాసిన ఉత్తరం అందింది.

మా అమ్మాయిని నీవు చూచిన రోజు.... నీకంటే ముందే మరో ఇద్దరు చూచారు. చూచిన మీ ముగ్గురినుండీ ఉత్తరాలం దాయి మా అమ్మాయి నచ్చిందని. మా అమ్మాయికి నచ్చిన వాడు సుగుణాకర్. మా సుగుణ జీవితంలో మొదటి పెళ్ళిచూపులు అతనితోనే అదేరోజు మాఅమ్మాయిని మొదట చూచిన వాడతడే. అతని మొదటి పెళ్ళిచూపులు గూడా మా అమ్మాయితోనే...... కట్నం ఆశించకపోవడమతని ఆదర్శానికి మచ్చుతునక.

సుగుణ రెండవ పెళ్ళిచూపులు శ్రీధర్‌తో. ఆయనకది పదవ పెళ్ళిచూపట. నీవేమో అంతకు ముందే అర్ధశతం పూర్తి చేసావట.

నీ కదో సరదాగా మారిపోయిందని గ్రహించాం.

తాను చూడబోయే అమ్మాయి గురించీ, ఆమె పూర్వాపరాల గురించీ, వారి కుటుంబ పరిస్థితి గురించీ వాకబు చేసే పెళ్ళిచూపులకు బయల్దేరుతారు. ఐనా.......అబ్బాయి ముందు అమ్మాయిని సంతలో సరకులాగా ఉంచిన వింత.... వాళ్ళంటే మా సుగుణకసహ్యం.

ఏమీ అనుకోకు.... పెద్దవాడిగా ఒక సలహా ఇస్తున్నాను. అబ్బాయిలంతా తమకు కాబోయే భార్యకు అందం, చదువు, ఉద్యోగం వుండి కట్నం.గూడా తేవాలనుకుంటే ఈ దేశంలో ఆడపిల్లలకు గానీ, మగపిల్లలకు గానీ పెళ్ళిళ్ళవుతాయా? "నీకే ఒక చెల్లి ఉందనుకుని ఆలోచించి యాభైరెండవ పెళ్ళిచూపులకెళ్ళు. ఫలితం కనబడుతుంది "

("జాగృతి" సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 9-15, 1989)

